ముళ్ళచెట్టూ, కమ్మని పువ్వూనూ

పండిత శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు

"అబ్బాయీ! పెద్దముండ నాట్లే పేలించక యీపాటికి కాస్త కూకలేసుకో. ఎంతటివాళ్లయినా లోకానికి కసింత వెరవాలి"

"ఏం వచ్చిందమ్మా యిప్పుడూ?"

"నన్నడుగుతున్నావా కోడై కూస్తూ వుండగాను?"

"నువ్వు చెప్పరాదూ?"

"ఎన్నని చెప్పను నాయనా?"

"వుండడమే వస్తే వున్నవన్నీ చెప్పాలి"

"వుండడమేవస్తే అంటే? వున్నాయనా లేవనా?"

"నేను చూశానా విన్నానా?"

"చూడనూ చూడక, వినమా వినక యేం చేస్తున్నావూ?"

"నా కిదే పనా?"

"కుటుంబగౌరవం గంగలో కలసిపోతూ వుంటే దాన్ని కాపాడుకోవడం నీ పనికాదూ?"

"ఏం లోటు జరిగిందీ యిప్పుడూ?"

"నువ్విలా వెనకేసుకు వస్తూవుంటే నిన్నిక లక్ష్యపెడుతుందా అదీ?"

"ఏం జరిగిందో చెప్పమంటే సోది మొదలు పెడతా వేమిటమ్మా?"

"నామాటలు సోదికిందే కట్టేశావా?"

"సోది కాదు. నిజమే. సందేహం లేదు. ఇంతకీ జరిగిపోయిన అకార్యకరణం యేమిటి?"

"వొక్కటనా రెండనా చెప్పడానికి?"

"పోనీ వది చెప్పూ"

"నీకు మానాభిమానాలే వుంటే వొక్కతప్పు చాలదూ?"

"........................"

నిన్ననడం యెందుకూ? ఈరోజు లలాంటివి. పూర్వకాల ప్పీనుగుని నే నెంత మొత్తుకుంటే యేం లాభమూ?"

"ఏం జరిగిందో చెప్పమంటే చెప్పవు. పోనీ అని వూరుకో నేనా వూరుకోవు"

"నిజమే. నా కెందుకూ యివాళవుండి రేపు చచ్చిపోయీదానికీ? కాని అలా అనుకుని కళ్లారా చూస్తూ వూరుకో లేను. ఏం చెయ్యమన్నావూ? మాటిమాటికీ నువ్వు చెప్పు దెబ్బలు కొడుతూనే వున్నావు. అయినా కన్నకడుపూ. నువ్వు నన్నెంత తీసిపారేస్తూవున్నా నీకు అపకీర్తి వస్తూవుంటే నేను చూడలేకుండా వున్నందుకు నువ్వు నన్నిలా అనవలిసిందే. ఎందుకులే. పడ్డవాళ్లెప్పుడూ చెడ్డవాళ్లు కారులే"

"అందరూ అంతేనా?"

"ఏకర్మమూ యెరగని వాళ్లంతే"

"ఎరిగిం దెవరో చెప్పరాదూ?"

"మేలుకున్నవాళ్లని లేపడం యెలాగ నాయనా?"

"……………….."

"పీనపాటివారి యింటో పుట్టాను. కల్లూరి వారియింటో పడ్డాను. రెండూ కూడా "హో హో" అనిపించుకున్న వంశాలే. అంచేతే యిలా గుంజుకుంటున్నాను; గాని కులం తక్కువదాన్నయితే నాకీ యేడుపే లేకపోయి వుండును"

"ఇప్పుడు కులం తక్కువవాళ్లెవరూ?"

"ఎవళ్లయితేమాత్రం నాకెందుకూ?"

"ఇంకేం మరీ? అలా అని మనస్సుకి సమాధానం చెప్పుకో. ఎప్పుడేమని పోతాలో అని కుర్రాళ్లు భయపడీలాగ—"

"నేనదే చెబుతూ వున్నాను"

"నువ్విలా తొందరమాటలంటూ వుంటే ఆమర్యాదా నిలుస్తుందా?"

"నిలిచే చోట నిలుస్తుంది. నిలిపీవాళ్లు నిలుపుతారు. తమకి మర్యాద కావలసినవాళ్లు యెదటివాళ్ల మర్యాదా నిలిపి తీరుతారు. మర్యాదా లేనివాళ్లూ యెరగనివాళ్లూ యేం నిలుపుతారూ?"

"మర్యాదా వున్నవాళ్లు లేనివాళ్లతో సరిగ్గా వెళ్లవచ్చునా?"

"పైవాళ్లయితే నువ్వన్నట్లే; కాని సంమ్మంధం యేడిసింది కదూ? బతికివున్నంత కాలమూ వొకయింటోనే తగులడాలి కాదూ? లేకపోతే యెవర్తిగొడవ యెవర్తి క్కావాలీ?"

"……………….."

"నాకొంపకి ముప్పువచ్చి నే నేడుస్తున్నాను గాని; లేకపోతే—"

"నిండింటో కూచుని నువ్విలా అనవచ్చునా?"

"ఏం చెయ్యాను? మాలకూడు, తినమంటావా……బోగం కొంపా సంసారికొంపా?"

"ఇంతకీ మొగాడు అనాథ అయితే ఆడది నడివీధిలో భాగోతం కట్టడంలో ఆశ్చర్యం లేదు"

"అమ్మా! అరికాళ్లకింద మంట లెత్తిస్తున్నావు"

"నా మాట నీ కంత కష్టంగా వుందా నాయనా? ఇదిగో లెంపలు వాయించుకుంటున్నాను. అపరాధం వచ్చింది. క్షమించు. గడ్డి తిన్నాను. ఇక కిక్కురుమంటే అడుగు. బుద్ధి వచ్చింది."

"……………….."

"ఇంకోమాటు ఈగొడవ తెస్తే చెప్పుచ్చుకు కొట్టు"

"……………….."

"మంచికి రోజులా యివి? పెళ్లాంగారు వచ్చాక యిక తల్లిముండ యెందుకూ?"

"……………….."

"మంచీ చెడ్డా తెలుసుకోడానికీ, కీర్తీ అపకీర్తీ గ్రహించడానికీ, ఎవళ్లని దిద్దుకోవలసినట్లు వాళ్లని దిద్దుకోడానికీ యెంతటివాళ్లు కావాలి

నాయనా! మొగాడై పుట్టగానే సరా? చదువు కోగానే తీరిందా?"

"................."

"ఎన్నేళ్లు వెడితే యేమిటి సిగ్గూ బిడియమూ లేకపోయాక?"

"................."

"ఇంతకీ దేవుడు నాగొంతు కోశాడు. ఆమహారాజుని బతకనిచ్చి నన్ను తీసుకుపోరాదూ? నాకీపాట్లు లేకపోవునే?"

"అమ్మా! ఇందాకణ్ణుంచి సాధించేస్తున్నావు. పేగులు తోడేశావు; కాని వొక్క తప్పు చెప్పలేకపోయావు"

"అవునోయి నాయనా! అంతే. అయితే అసలు నిన్ను కదపడమే నాకు బుద్ధితక్కువ. నువ్వింతవాడవైనాక యింకా నోరు తెరిచి— అయ్యో! నాబతుకు కాలిపోనూ"

"................."

"నా గ్రహచారం. వెంకు సోదెమ్మతో కాశీ వెళ్లిపోయివుంటే నాకీముప్పు వచ్చునా?"

"................."

"నిర్భాగ్యపుజన్మ. నాకు కాశీవాసం కూడా లభిస్తుందా? ఈ కళ్లతో ఎంత పాపం చూడాలో? ఎన్ని కుళ్లుమాటలు వినాలో? ఎన్నితిట్లు తినాలో? ఎన్ని చెప్పుదెబ్బలు పడాలో? అప్పుడే అయిందా?"

"................."

"ఇంతకీ యెవళ్లు చేసుకున్న దెవళ్లనుభవిస్తారూ?"

"చివరికి చెప్పవలిసిందీ, చెప్పేదీయేమేనా వుందా యింతేనా అమ్మా?"

"వుంటేమాత్రం నాకెందుకు నాయనా? నీకిప్పటికేనా అభిమానం వచ్చిందేమో అనుకున్నాను"

"................."

"కందకి లేని దురద బచ్చలి కెందుకూ? "ఎన్నాళ్లై చచ్చావంటే ఆర్నెల్ల కిందటే" అన్నట్లు యేదియేమైనా నోరుమూసుకు వూరుకోవాలి గాని లేకపోతే మాట తక్కుదు"

"................."

"చివరికి రోస్టు నాకెందుకూ? నేను నలుగురినోళ్లలోనూ పడిపోవడం యెందుకూ? అడ్డమైనకుంకలూ నాకు చక్కట్లు దిద్దరావడం యెందుకూ? ఇంతకంటే యీకొంప బాగుపడి యేడిస్తేనా?"

"నేను కచేరీకి వెళ్లిపోవచ్చునా అమ్మా?"

"వెళ్లవచ్చు నాయనా! నిశ్చింతగా వెళ్లవచ్చు. కళ్లు మూసుకుంటే సరీ. మొండివాడు రాజుకంటే బలవంతుడట"

"హు—"

"వోస్. దీనిపేరు పౌరుషం కామోసు. ఇలాంటి వాజమ్మలకే అలాంటిదీ?...................వూరికే పోవడమేం? గడ్డితిన్నట్టు తిని, కుడితి తాగినట్టు తాగే పోవచ్చు. వుందనా లేదనా? పూర్వపాళ్లు యింత మట్టి సంపాదించి పోయారుకదూ?"

౨

"ఏం వచ్చిం దేమిటి?"

"...................."

"ఎందు కలా యేడుస్తావూ?"

"...................."

"ఏం జరిగిందో చెప్పకపోతే యెలాగా?"

"నోటితో చెప్పాలా సగం చచ్చివుండి కూడానూ?"

"చెప్పకుండానే తెలుసుకోవచ్చు విసీ చూసీ వుంటే, కాని యింటో లేనుకదూ?"

........................,"

"ఎన్ని దుఃఖకారణాలు వచ్చినా కొంచెం సమాళించుకోవాలి. ఆవురు మని యేడిస్తే యేం లాభమూ?"

"నామీద చెయ్యి వెయ్యకండి. నేను మాలపీనుగుని. భోగంముండని"

"ఇష్టాలు లేకపోతే యెన్నిమాటలేనా వస్తాయి. అయినా—"

"నే నేమేనా అన్నానా?"

"నువ్వే అన్నా వనలేదు"

ఇద్దర్నీ సరిచేస్తున్నారా?"

"........................."

"ముందు కజ్జా పెట్టిన పీనుగుని చెప్పదెబ్బలు కొడతారా?"

"..............."

"పోనీ ముందు నేను తగువు పెట్టడం యెప్పు డేనా యెరుగుదురా మీరూ?"

"...................."

"నే నిక పడలేను. నాకు బతికే యోగం లేదు. నా కేదో దారి చూపించండి".

"వొక్కటే దారి—"

"గోదారి కదూ? అవును. మీ రలా అనకపోతే మ రేమంటారు?"

"ఇంతకీ జరిగిన ప నేమిటి?"

"మీరు వినకుండా వున్నారా? మీకు తెలవకుండానే వుందా నిజంగా?"

"నీ కష్టాలు వినలేదు కాదూ?"

"నా కష్టాలు వినా లని వుందా?"

"................."

"ఈపాడు జన్మకి కష్టాలు కాకపోతే సుఖా లెలా వస్తాయీ?"

"..........."

"రామరామా! ఇంత దిక్కుమాలిన బతుకైపోయిందా నాదీ?"

"ఇప్పు డేం వచ్చిందో చెప్పవూ?"

"బందరు వుప్పెన. రావడానికి మ రేం వుందీ? నా చెయ్యి వదలండి"

"ఎందుకు వచ్చిందీ?"

"నేను బతికి వుండడమే కారణం. ఎందుకు వచ్చిం దంటే యింకేం జెప్పనూ?"

"................?"

"నాకర్మం కాలిపోయింది. నాఅవస్థ యింతట్లో తీరేదీ కాదు, మానేదీ కాదూ. తెల్లపోయి అలా నుంచుంటా రేం? కాఫీ చల్లారి

పోతుంది పుచ్చుకోండి. తొరగా వెళ్లకపోతే అవతల మాట పడాలి లేవండి"

"ఇంటో యిలా తగులడుతూ వుంటే నోటికి పోతుందా యేమేనా ?"

"నన్నేనా అందర్నీ అడుగుతాగా అలా నిలవదీసి ?"

"అడగవలసిన మనిషి నడుగుతాను. తాబట్టిన కుందేటికి కాళ్లనీవాళ్లని అడిగితే మాత్రం యేం లాభమూ?"

"అయితే నాగతి యింతే యింక ?"

"ఆపదలు కాపరాలు చేస్తాయా?"

"చాల్లెండి నేర్చుకుపోయారు వేదాంతాలు. ఇప్పుడేనా యింటోయిలా తగులడుతూవుంటే నోటికిపోతుందా అని అడిగారు మీరు? ఎవళ్లో తగులడుతూంటే పైవాళ్లకి మీకే అలావుంటే స్వయంగా తగులడీవాళ్లకి — నల్లేరుమీదకి బండిలాగ గెంటుకువస్తూంటే దిక్కులేనివాళ్ల కెలా వుంటుందీ?"

"................"

"మాట్లాడరేం?"

"................"

"అయ్యో! నీకింత గండగత్తెర వచ్చిందా అని వోదార్చడాని కేనా తగనూ నేనూ? నా వాళ్లెవరూ దగ్గరలేరనా యీ లోకువ?"

"................"

"నేనేం తప్పు చేశానూ? నావాళ్లు మాత్రం యేంలోటు చేశారూ? అడిగినంత కట్నమూ, కోరినన్ని లాంఛనాలూ— మొగాన యెన్ని కాసులు కొడితేయేమీ? యెదాన యెన్ని చీరలుపెడితే యేమీ?"

"................"

"పెళ్లిలోనే మొదలు యేడిపించడానికి. వూరంతా ముక్కుమీద వేలేసుకున్నారు ఆ మంకుతనం చూసీ, వొక్కపూటేనా నవ్వుతూ భోజనానికి వచ్చినపాపాన పోతేనా? 'ఆ'అంటే అపరాధం, 'నారాయణా'అంటే బూతూ.తిన్న వణ్ణం వొంటపట్టనివ్వలేదు యిల్లాలు"

"..............."

"కార్యం నాటికి మూలపడ్డా పులుసు చావలేదు. వొక్కటే ధోరణి ఆజన్మకి"

"..............."

"నన్ను చూస్తే కళ్లు చిమచిమ లాడిపోవాలా? నేను విషం తాగించానా? తనకి నావంటివాళ్లు లేరూ?"

"......................"

"అంతకంటే నే నేమేనా విధం చెడ్డానా? అడిగీవాళ్లు లేక గాని తన ఆశ వంటి ఆశ కాదూ అందరిదీనీ?"

"నాకేసి చూడూ"

"నే నేడుస్తూ వుంటే చూడాలనివుందా?"

"అంత రాసి రంపాన పెడితే అదేలా బతుకుతుం"దని కాస్త అడగ్గూడదూ?"

"ఇదివరకు అడగలేదూ?"

"అడిగేం లాభమూ? నింపాదిగా అడిగితే మర్యాదా తక్కించుకునీ పుట్టుకే అదీ?"

"ఎంత బాధ పెడుతూ వున్నా కన్న తల్లిని కఠినంగా మందలించడం——"

"చేసుకున్న పెళ్లాన్నయితే కోసి కారత నెయ్యవచ్చు కదూ!"

"అది నీ నాభిదగ్గిరనుంచి వచ్చిన మాటే?"

"నసాళం అంటుకుంటూంటే నాభిలెక్కేమిటి? అటు యేడూ, యిటు యేడూ పధ్నాలుగు తరాల నుంచి నా వాళ్లు దిక్కుమాలిన వాళ్లయిపోతున్నారు. తన వాళ్ల నెవళ్లేమన్నారూ?"

"ఏదో చూడూ. పూర్వకాలపు మనిషి. ఎరగవూ? ఎలాగో వొరగేసుకు పోకపోతే అపకీర్తి కాదూ!"

"అయ్యో నాబతుకు బగ్గైపోతే యింకా వొరగేసుకు పోవడం యేమిటండీ?"

ఇదివర కిలాగే తప్పు నీమీద లేకుండా——"

ఇంకనేం? నావల్ల తప్పు లేనప్పుడు మీదమీదకి రావడం యెందుకూ?"

మళ్లీ మొదలూ——"

"మళ్లీ యేమిటి మళ్లీ యేమిటి? ఎప్పటి కప్పుడే మొదలూ. ఎప్పటి కేనా అంతం అంటూ వుంటేనా?"

"అలా అనకు"

వాళ్లు మందుకు పోతూ వుంటే ఆనక యేం చెయ్యనూ? "కొడుకు బాగుండాలి కోడలు ముండా మొయ్యా" లనే రకంగా వస్తూవుంటే యెందాకానూ వోపిక పట్టడం?"

"................"

"తనెంత తన తాహతెంత? నా వాళ్ల మాట యెత్తడానికి తనకేం అవసరం వచ్చిందీ?"

"వూరుకోవూ?"

నాతమ్ముడు రేపు కలకటేరయిపోతాడు. సీమ వెళ్లినవాళ్లంతా పుచ్చిపోయూరా? తనవాళ్లే అంత వాళ్లయితే యిక కిందా మీదా వుండునా?"

"................"

నావాళ్లెవరూ రైలువాళ్లకి నౌకరీ చెయ్యడం లేదు"

"నన్నేనా చూడవూ?"

"మిమ్మల్ని చూస్తున్నాను కనకనే నా గతి యిలా వుంది. తనతో సరిగ్గా నేను కూడా తూర్పారబట్టేదాన్నయితే నా కీ యేడుపేమీ?"

"ఇంకేం మరీ? వోపిక పట్టడం యెలాగా తప్పనప్పుడు యీ కాస్త మాత్రం యెందుకూ?"

"................"

"లే, నా మాట విను, నాకు టైము దాటిపోనివ్వకు"

"వుండండి, నన్ను వొదలండి, నేను లేవగలను, మీరు వెళ్లి చేతులూ కాళ్లూ కడుక్కురండి"

"అన్నీ అయినాయి. ముందు నువ్వు లే"

"అబ్బా వులిక్కిపడ్డానూ......నన్నిట్టే బుట్టలో పెట్టగలరు. అక్కడ కిమన్నాస్తి. ఏడ్పి దాన్ని నవ్వించినా, నవ్వీదాన్ని ఏడ్పించినా నన్నే కదూ? వొక్కమాటేనా "నీకిది బుద్ధి కా"దని గట్టిగా చివాట్లు పెడితే నాకీ కించ లేకపోవునే"

"చూడూ——"

"చూస్తూనే వున్నాను మీ అభిమానాలు"

"అదిగదీమాట, సెబాస్"

"వున్నమాట అంటే వులు కెక్కువ"

"వుండడమే వస్తే అంతే. కాని వుంటే యీామెడమొగాలూ పెడమొగాలూ యేం?"

"వేషాలు"

"నాకేసి చూస్తూ అనూ ఆమాట"

"ఏం? నాకేం భయమా?"

"లేదని నేనెరగనూ"

"ఏమిటీ?"

"ఏమయితే యేం లెద్దూ. చూడూ. గంతులేసీవాళ్లతో సరిగ్గా గంతు లెయ్యడం కాదు ప్రయోజకత్వం, వొకళ్లు గంతులేసేటప్పుడు మొదటివాళ్లు వూరుకుంటే తప్పెవరిదౌతుందీ? వేరేనోటితో చీవాట్లు పెట్టాలా?"

"మరే, ఇక యెన్నేనా చెబుతారు కబుర్లు. అయితే లెండి. ఎప్పుడూ చీకటే వుంటుందా?...... ఇవాళ పొయ్యి అంటించాటప్పటికి కాలు దువ్వింది. మనస్సు మనస్సులో లేదు. పకోడీలు పాకానపడ్డాయో లేదో చూసుకు మరీ తినండి"

"నీ మొగమ్మీద చిరునవ్వు మెరిసిపోతూవుంటే నాకన్నీ బాగానే వుంటాయి."

"ఏం కమ్మగా వుందా?"

"బకలుతీర్చేవూ? మరు పన్నది మెరగవు పాపం అయితే లే. వర్షాకాలపు మేఘం శరన్మేఘంగా మారిపోయింది నా కదే పదివేలు. మనస్సిప్పటికి కుదుట పడింది"

"కొందరికి మొదటివాళ్లేడుస్తూ వుంటే ఆనందం. ఆతల్లి బిడ్డలు కాదూ?"

"మళ్లీ యిలా తిప్పేవూ చక్రం?......ఇంకెందుకూ నాకూ? కబుర్లేనా నువ్వేమేనా——?"

"నా మొగమ్మీద చిరునవ్వు మెరిసిపోతూ వుంటే మీ కన్నీ బాగానే వుంటాయన్నారు. మీరు కులాసాగా వుంటే నాకు కడుపు నిండిపోదూ?"

"రత్నాల మాట! వెల వుందా ఆ మాటికీ? గాఢారణ్యంలోనుంచి నందనోద్యానంలో పడ్డట్టుంది. ఏదీ?"

"కీ....................."

"....................."

"అ——బ్బా! చంపేశారు"

"తొందరగా కాఫీ పుచ్చుకో"

"చుర్రు మనడానికా? పన్ను దిగిందో యేమిటో? వాకట్లోకి యెలాగా వెళ్ళడం?"

"మరో నాలుగు చిలక లెక్కువ తగిలిస్తే సరి రంగులో రంగు—"

"ఏం? బాగుందా?"

"దివ్యచకోరంగా వుంది. ఇప్పుడో?"

"అ—మ్మో! హూనం అయిపోయింది వొళ్ళు. చూశారా? నాకేం?

రాజరాజు

జి. జాషువకవిగారు

నిన్నుఁబోలు మహీనేత నిక్కువముగఁ-బుట్టెనో! పరాశర దివ్య మునిసుతుండు
మున్ను మాతాత, పరిహాసమునకుగాను-కల్పనముఁజేసి వ్రాసెనో కౌరవేశ!
మాతాత సత్యవంతుఁడు-పూతములగు నాల్గువేదములు వ్రాసినవి
ఖ్యాతకవీంద్రుం డాతని-చేతి కల మబద్ధములు వచింపదుసుమ్మా.
వ్యాసకల్పిత మహాభారతామ్నాయంబు గుట్టుగా నిముఁ దిట్టుకొనుచునుండ
ముగురుసత్కవుల పెంపుడుకావ్యరాజంబు పదిమందిలో బట్టబయలు సేయ
యింతలంతలు సేయు దృశ్యప్రబంధాళి మొత్తమై నిన్నాడిపోసికొనఁగ
చెప్పుడుమాటకుఁ జెవియొగ్గు భువనంబు "క్రూరాత్ముఁ" డని పండ్లునూరుచుండఁ
దౌడలుతెగిన బాధతో నింత దుష్కీర్తి-తోఁ బరాజయంబు తోడ రాఁగ
నరకమునకుఁబోయినావో, స్వర్గమునకుఁ-జేరినావో! నీవు కౌరవేశ!